క్లుప్తంగా

22న శ్రీరామ హనుమాన్ యజ్ఞం

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్టవద్ద నున్న కార్యసిద్ధి అభయాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 22న శ్రీరామ హనుమాన్ యజ్ఞం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అయోధ్య శ్రీ రామమందిర ప్రతిష్టాపన మహోత్సవం పురస్కరించుకుని ఉదయం 11 నుంచి 1 గంట వరకు యజ్ఞం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



ట్రాన్స్‌కో ఈఈ కె. మునిచందర్

పీలేరు : పీలేరు సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్లలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ట్రాన్స్‌కో ఈఈ కె. మునిచందర్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తలపుల సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మెన్ నిర్లక్ష్యంతో ఇద్దరు సిబ్బంది విద్యుదాఘాతానికి గురి కావడం బాధాకరమన్నారు. పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, కలకడ, కేవీపల్లె, గుర్రంకొండ, యర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాల్లో మొత్తం 50 సబ్‌స్టేషన్లు ఉన్నాయన్నారు. అన్ని సబ్‌స్టేషన్లను తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏడీ సుధాకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో సిమెంటు రోడ్డు



పూర్తయిన సిమెంటు రోడ్డు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని సంపతికోట పంచాయతీలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి 10 రోజుల క్రితం గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇదే పంచాయతీలోని ముంతపోగులవారిపల్లిలోని ఓ వీధిలో సిమెంటు రోడ్డు వేయించాలని కోరగా స్పందించిన ఎమ్మెల్యే తక్షణం రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించి రోడ్డు పనులు పూర్తి చేయించారు. ఈ రోడ్డు పనులను గురువారం ఎంపీపీ మహమూద్ పరిశీలించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమాశంకర్‌రెడ్డి, మధు, రవీంద్రారెడ్డి, ఉత్తన్న తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



గెలుపొందిన వారికి బహుమతులను అందిస్తున్న నరేంద్ర కుమార్ రెడ్డి

వాల్మీకిపురం : క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తోందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి నరేంద్ర కుమార్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చింతపర్తికి చెందిన కోటపల్లి అనసూయమ్మ, కోటపల్లి రెడ్డెప్ప రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు కోటపల్లి సనోంద్ర రెడ్డి ఆధ్వర్యంలో మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి బహుమతి రూ.15,116లు, రెండవ బహుమతి 10,116లు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చింతపర్తి గ్రామ ప్రజలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కలికిరి : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గంగయ్య అన్నారు. మండలంలోని గుట్టపాళెం గ్రామంలో స్థానిక సర్పంచ్ వెంకటరెడ్డి అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రజలకున్న సందేహాలను నివృత్తి చేశారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. వైస్ ఎంపీపీ శ్రీకాంత్, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నోడల్ టీం సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గొబ్బెమ్మ నిమజ్జనం

రాజంపేట టౌన్ : మండలంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం గొబ్బెమ్మ నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గొబ్బెమ్మ ప్రతిమలను పురవీధులు, గ్రామాల్లో ఘనంగా ఊరేగించారు. దారిపొడవునా మహిళలు గొబ్బెమ్మ పాటలను పాడుతూ సాగారు. యువకులు బ్యాండు నృత్యాలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. అలాగే పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చారు. పట్టణానికి చెందిన వారు గొబ్బెమ్మ ప్రతిమలను పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న హత్యరాల మడుగులో నిమజ్జనం చేయగా, గ్రామీణ ప్రాంతాల వారు తమకు సమీపంలో ఉన్న చెరువులు, నీటి కుంటల్లో నిమజ్జనం చేశారు. కనుమ మరుసటి రోజు నుంచి నిత్యం మండల వ్యాప్తంగా కొన్ని గ్రామాల్లో గొబ్బెమ్మ నిమజ్జన వేడుకలు జరుగుతున్నాయి.

వెల్లివిరిసిన సంక్రాంతి సంబరాలు



వాల్మీకిపురం: పశువులను అలంకరణ చేసి ప్రదర్శన చేస్తున్న యువకులు



వాల్మీకిపురం: చిట్లాకుప్ప వద్ద సందడి వాతావరణం

వాల్మీకిపురం : పీలేరు నియోజకవర్గంలో రైతులు ఈ ఏడాది పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తనయుడు చింతల సాయికృష్ణారెడ్డి అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని గురువారం మండలంలోని వాల్మీకిపురం, చింతపర్తి, ప్యారంపల్లి, గొళ్లపల్లి, ఆరమడక, ఫత్తేపురం, జర్రావారిపల్లె, వడ్డిపల్లె తదితర గ్రామాల్లో మహిళలు తెలుగుదనం ఉట్టిపడేలా సంక్రాంతి ముగ్గులు వేసి తమ వాకిళ్లను కొత్త అందాలతో అద్భుతంగా తీర్చిదిద్దారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సాయిబాబా నగర్, పింగాణీ ఫ్యాక్టరీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చిట్లాకుప్పల వద్ద కాటమరాజు వేడుకలు నిర్వహించారు. చింతల సాయిక్రిష్ణారెడ్డి సాయిబాబానగర్‌లోని చిట్లాకుప్ప వద్ద కాటమరాజుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పశువులను అలంకరణ చేసి చిట్లాకుప్పకు నిప్పు పెట్టి ఆ కుప్పకు పశువులను మూడు సార్లు ప్రదక్షిణలు చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ప్రజలు పాల్గొన్నారు. కాగా సంక్రాంతి పండుగ ఏ రోజొచ్చినా గురువారం రోజే జరుపుకోవడం ఇక్కడి కొన్ని పల్లె ప్రజల ఆనవాయితీ.



కలికిరి : కాటమరాజు వద్ద పూజలు

కలికిరి : మండలంలోని పలు గ్రామాలలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కలికిరి పట్టణం, మర్రికుంటపల్లి, మేడికుర్తి తదితర గ్రామాల్లో సంక్రాంతి వేడుకలు చేశారు.



రామసముద్రం మండలం తిరుమలరెడ్డిపల్లెలో పశువులను ఊరేగిస్తున్న దృశ్యం

రామసముద్రం : మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయతీలో సంక్రాంతి పండుగను గురువారం వైభవంగా నిర్వహించారు. తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించి గెలిచిన వారికి, వివి.రాజు, అన్సర్‌బాషా, ఆవణివిజయ్, దామోదర్‌రెడ్డి, సాఫ్ట్‌వేర్ శేఖర్ బహుమతులు ప్రదానం చేశారు.

క్రీడా స్ఫూర్తిని అలవరచుకోవాలి

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె : క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ అన్నారు. మదనపల్లె మండలం చిప్పిలి గ్రామంలో రెండురోజులుగా నిర్వహించిన చిప్పిలి వాలీబాల్ టోర్నమెంట్–2024 గురువారం తుదిదశకు చేరుకుంది. టోర్నమెంట్ ఫైనల్స్ పోటీలకు ముఖ్యఅతిథులుగా మల్లయ్యకొండ ఆలయ కమిటీ మాజీచైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్‌తో కలిసి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఫైనల్ మ్యాచ్‌లో చిప్పిలి జట్టుపై అడగల్లు జట్టు 25 స్కోరుతో గెలుపొందింది. ఫైనల్స్ విజేతకు రూ.12వేలు, రన్నర్స్‌కు రూ.10వేలు, మూడోస్థానంలో నిలిచిన జట్టుకు రూ.4వేలు, నాలుగోస్థానంలో నిలిచిన జట్టుకు రూ.1,000 అందజేశారు. కౌన్సిలర్ గిరిజ, సాయిశేఖర్‌రెడ్డి, చిప్పిలి యూత్ శశికుమార్, చిన్నా, వేణు తదితరులు పాల్గొన్నారు.



విజేతకు ట్రోఫీ అందజేస్తున్న సమన్వయకర్త నిసార్ అహ్మద్, చైర్‌పర్సన్ మనూజారెడ్డి

రేపు మల్లయ్య కొండపై తలనీలాల వేలం

తంబళ్లపల్లె : తంబళ్లపల్లె మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో మహా శివరాత్రి పర్వదినాన జరిగే ఉత్సవాల సందర్భంగా తలనీలాల సేకరణ హక్కు పొందడానికి శనివారం ఉదయం బహిరంగ వేలం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ మల్ రెడ్డి, ఈఓ రమణ తెలిపారు. తలనీలాల సేకరణ, వాహనాల పార్కింగ్ వేలంపాటల్లో పాల్గొనే వారు రూ.లక్ష డిపాజిట్టు చెల్లించాలన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిన నాయకులు

వాల్మీకిపురం : విజయవాడ నగరం నడిబొడ్డున ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ స్మృతివనంలో నిర్మించిన అంబేడ్కర్ 125 అడుగుల సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణకు మండలం నుంచి అన్ని కులాల వారు భారీ ఎత్తున తరలి వెళ్లారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి ఉపసర్పంచ్ బిడ్డల కేశవ రెడ్డి ఆధ్వర్యంలో బస్సు బయల్దేరింది. నాయకులు నీళ్లభాస్కర్, రాయుడు, రఘు, ఆనంద, రవి, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రం : విజయవాడలో ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవానికి గురువారం రామసముద్రం మండలం నుంచి 50 మంది సభ్యులతో కూడిన బృందం బయలుదేరింది. ఎంపీడీవో నారాయణస్వామి జెండా ఊపి బస్సును ప్రారంభించారు. సచివాలయం కన్వీనర్ భాస్కర్, దళిత సీనియర్ నాయకులు గుర్రప్ప, ఎస్సీసెల్ అధ్యక్షులు కృష్ణప్ప తదిరతులు వెళ్లారు.

పూత దశలోనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

రాయచోటి టౌన్ : మామిడిలో పూత దశలోనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రాయచోటి ఉద్యాన శాఖ అధికారిణి నాగమణి తెలిపారు. రాయచోటి రూరల్ పరిధిలోని మాధవరం, కాటిమాయకుంట గ్రామాలలో మామిడి రైతులకు పూతదశలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడిలో పూత ఒకే సారి రావడానికి, వచ్చిన పూతలో ఆడ శాతాన్ని పెంచుకోవడానికి 13-0-45 (మల్టీ కె) 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. అలాగే మ్యాంగో స్పెషల్ 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. లేదా ఫార్ములా - 4ః 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. రైతు భరోసా కేంద్ర వ్యవసాయ సహాయకులు ప్రసన్న, నిరంజన్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ములకలచెరువు: జాతీయ స్థాయిలో జరిగిన వేమన పద్యాల పోటీల్లో ములకలచెరువు మండల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఎంఈఓ వెంకట్రమణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వేమన జయంతి సందర్భంగా చిత్తూరు జిల్లా పలమనేరులో తెలుగు సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 100 వేమన పద్యాల పోటీలకు ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో 1 నుంచి 10 వరకు చదువుతున్న 200 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా అన్నమయ్య జిల్లా ములకలచెరువు మండలానికి చెందిన తేజశ్రీ, శాంతి, చరణ్, ప్రదీప్, సానియా, గౌతమ్, ఓజేశ్వరి, కుషేంద్ర అనే విద్యార్థులు ఏకధాటిగా 100 పద్యాలు చెప్పి సత్తా చాటి బహుమతులు పొందారన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

మదనపల్లె సిటీ : విధి నిర్వహణలోని డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలని ఆర్టీసీ-2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ అన్నారు. గురువారం స్థానిక డిపో కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎం మాట్లాడుతూ ఆర్టీసీపై ప్రయాణికులు ఎంతో నమ్మకంతో బస్సు ప్రయాణం చేస్తారన్నారు. ప్రయాణికుల మన్ననలు పొందాలన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడటం వంటివి చేయరాదన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ తప్పకుండా పాటించాలన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో ప్రమాదాలు చేయని డ్రైవర్లను గుర్తించి వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ తమ సంస్థగా భావించి పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మోటివేటర్ రామమూర్తి, సీఐ గీత, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎం ఆర్‌సీ నిరంజన్

నియోజకవర్గ ఆటలపోటీలకు ఎంపిక



క్రికెట్ జట్టును అభినందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెద్దమండ్యం : మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా పోటీలలో ఆయా విభాగాలలో విన్నర్‌లుగా నిలిచి నియోజకవర్గ పోటీలకు ఐదు జట్లు ఎంపికైనట్లు ఎంపీడీఓ శ్రీధర్‌రావు తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా పోటీలలో గ్రామస్థాయి నుంచి యువత క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలలో పోటాపోటీగా పాల్గొన్నట్లు తెలిపారు. మండలస్థాయిలో క్రికెట్‌లో విన్నర్‌గా బండమిదపల్లె జట్టు నిలిచిందన్నారు. అలాగే ఖోఖో, బాడ్మింటన్, కబడ్డీ, పోటీలలో కలిచెర్ల జట్టు , వాలీబాల్‌పోటీలలో పెద్దమండ్యం పంచాయతీలోని చెరువుకిందపల్లె జట్టు నిలిచినట్లు తెలిపారు. మండల స్థాయిలో విన్నర్‌లుగా నిలిచిన జట్లు ఈ నెల 24 నుంచి నియోజకవర్గ స్థాయిలో జరిగే ఆటల పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గరీబ్ నవాజ్ ఛట్టీ చదివింపులు



చాదర్‌ను సమర్పిస్తున్న చింతల సాయికృష్ణారెడ్డి తదితరులు

వాల్మీకిపురం : స్థానిక సయ్యద్ ఖాజాపీర్ మస్తాన్ వలి దర్గాలో గురువారం గరీబ్ నవాజ్ ఛట్టీ కార్యక్రమాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం దర్గాను శుద్ధి చేసి వివిధ రకాల పుష్పాలతో దర్గాను సుందరంగా అలంకరించారు. అనంతరం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తనయుడు చింతల సాయికృష్ణారెడ్డి చాదర్‌ను దర్గాకు సమర్పించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆఘా మొహియుద్దీన్, ముస్లింలు సందాని, అజీమ్, కలీమ్, జవాద్ హుస్సేన్, కరీమ్, జబ్బార్ సాహెబ్, ఖాజాపీర్, మౌల, తాహీర్, షబ్బీర్ అహ్మద్, నసీర్ హుస్సేన్, నాయకులు నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, శ్రీధర్‌రాయల్, శ్రీనివాసులు శెట్టి, సత్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను ఆశీర్వదించండి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పీలేరు పట్టణంలోని యల్లమంద క్రాస్, కావలిపల్లె, మారుతినగర్, సైనిక్ నగర్‌లో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వం అందించిన పథకాలు చదివి వినిపించడంతో పాటు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలు అప్పటికప్పుడు సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలో వందశాతం అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మరోసారి జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు గతంలో 650 హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, సర్పంచ్ జీనత్ షఫీ, స్టాంపుల నరసింహారెడ్డి, దండు జగన్ మోహన్‌రెడ్డి, ఎస్.వి. చలపతి, మహితాఆనంద్, ఉదయ్‌కుమార్, రామ్‌నరేష్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, షాకీర్, నాగభూషణం, కాలనీచిన్న, సురేంద్రరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై దృష్టి సారించండి

మండల మీట్‌లో సభ్యుల డిమాండ్



మండల మీట్‌లో సభ్యులు అడిగిన సమస్యలకు సమాధానమిస్తున్న అధికారులు

గుర్రంకొండ : అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సీతమ్మ ఆధ్వర్యంలో మండల మీట్ నిర్వహించారు. ఈసందర్భంగా పలు సమస్యలను సభ్యులు సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గెరికుంటపల్లె అంగన్‌వాడీకేంద్రంలో కోడిగుడ్లు, పాలు, పౌష్టికాహారం ఇవ్వడం లేదని మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల అన్నారు. అంగన్‌వాడీకేంద్రాల నిర్వహణ, సచివాలయ పోలీస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు అప్పగించామని వారు సక్రమంగా విధులు నిర్వహించేలా చర్యలు చేపడతామని సీడీపీఓ దేవమ్మ అన్నారు. మండలంలోని రూ.3.20 కోట్ల మేరకు జేజేఎమ్ నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేసి తద్వారా తాగునీటి సమస్యలు పరిష్కరించామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ లాల్ స్వామి అన్నారు. మండలంలో ఇప్పటి వరకు 220 మంది రైతులు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తు చేసుకోగా 170 మందికి ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చేశామని ఇన్‌చార్జ్ ట్రాన్స్‌కో ఏఈ మోసీన్ అన్నారు. రైతులు కొత్త వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఆన్‌లైన్‌లో ఇప్పటికీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మండలంలోని టి.గొల్లపల్లెలో, చిట్టిబోయనపల్లె గ్రామాల్లో ఇళ్లపైన విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని, గ్రామాల్లో అవసరమైన చోట అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని వైస్ ఎంపీపీ కరుణాకర్ అన్నారు. హౌసింగ్‌లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకొన్నప్పటికీ మొదటి మూడు బిల్లులు పెండింగ్‌లో ఉంచి చివరి బిల్లు ఎలా మంజూరు చేశారని మండల ఆర్బీకే ఛైర్మెన్ జయచంద్రారెడ్డి ప్రశ్నించారు. సింగిల్‌విండో ఛైర్మన్ నక్కాచంద్రశేఖర్ , సర్పంచ్ గోపాల్ నాయుడు, మండల వైద్యాధికారి రవీంద్రనాయక్, ఎంపీటీసీ గంగులమ్మ మాట్లాడారు. మార్కెట్‌కమిటీ ఛైర్మన్ రవినాయక్, ఎంపీపీ సీతమ్మ, జెడ్పీటీసీ సమ్రీన్‌ముక్తియార్, మండల ప్రత్యేక ఆహ్వానితులు చంద్రశేఖర్, సర్పంచ్ రౌనఖ్‌భాషా, ఎంపీటీసీలు సరస్వతి, బాబయ్య, ఎఈ జావీద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాణి, మహాలక్ష్మీ, ఎపీఎమ్ రమణ, ఏపీఓ జయరామిరెడ్డి పాల్గొన్నారు.

క్రిష్టియన్ మైనార్టీల అభివృద్ధికి సహకరించాలి



బాధితుడికి నగదు అందచేస్తున్న మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్

కలికిరి : రాష్ట్రంలోని క్రిష్టియన్ మైనార్టీల అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మెన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్‌ను వైఎస్సార్‌సీపీ క్రిష్టియన్ విభాగం జిల్లా అధ్యక్షుడు బోనాసి జాన్ బాబు కోరారు. మహల్‌లోని మైనార్టీ కమిషన్ చైర్మెన్ కార్యాయంలో గురువారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి క్రిష్టియన్‌ల అభివృద్ధిపై విన్నవించారు. అనంతరం జిల్లా క్రిష్టియన్ మైనార్టీ అవగాహన సదస్సుకు ఆయనను ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ విభాగం నేతలు డాక్టర్ ఆసాది వెంకటరమణ, ఫాస్టర్‌లు విజయశేఖర్, జీవరత్నం, ఎలిసా, సుధాకర్‌రావు, దేవదానం, దినకరన్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కలికిరి : మండలంలోని అద్దవారిపల్లి గ్రామ పంచాయతీ యర్రదొడ్డిపల్లికి చెందిన కె.రవికుమార్ కిడ్నీ సంబంధిత వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. బాధితుడి విన్నపం మేరకు ఎంపీ మిథున్ రెడ్డి రూ.50వేలు తన సొంత నిధులు అందజేశారు. ఈ మేరకు గురువారం మహల్‌లోబాధితుడు రవికుమార్‌కు నగదును అందచేశారు.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోండి



పీలేరు పంచాయతీ కార్యాలయంలో వికసిత్ భారత్ కార్యక్రమం

పీలేరు : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ జీనత్‌షఫీ అన్నారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు.

కేవీపల్లె : వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గర్నిమిట్ట, మోటుపల్లెవాండ్లపల్లెలో గురువారం అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి పలు పథకాలపై అవగాహన కల్పించారు. జెడ్పీటీసీ గజ్జెల శృతి, సర్పంచ్ రమణమ పాల్గొన్నారు.

సేవలు అందించడమే లక్ష్యం

కలకడ : కుటుంబ బీమా, వ్యక్తి గత బీమా, ప్రమాద బీమా, పేద కుటుంబాలకు రాయితీ పై పరిశ్రమల ఏర్పాటు, రాయితీరుణాలు మంజూరు వంటి 18రకాల సేవలను అందించడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యం అని గ్రామాలలోని యువతకు ఉపాధిఅవకాశాలు, చేయవలసిన పనులపై అవగాహన కలుగుతుందని ఎంపీడీఓ రమేశ్వర్‌రెడ్డి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డిలు అన్నారు. గురువారం మండలంలోని కలకడ, బాలయ్యగారిపల్లె పంచాయతీ లలో సర్పంచ్‌లు ఫ్యారీజాన్ ఆద్వర్యంలో అవగాహన కల్పించారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

వాల్మీకిపురం : గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు వచ్చే నిధుల ద్వారా చేపట్టాల్సిన ప్రణాళికాబద్ధమైన, మంచి నీటి సౌకర్యాలు, ప్రజా ఆరోగ్యం, వ్యవసాయం, ఉపాధి హామీ, ఐసీడీఎస్, హౌసింగ్ తదితర శాఖల ద్వారా తీసుకోవాల్సిన సహాయ సహకారాలను పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం ఇచ్చారు. వైస్ ఎంపీపీ వెంకట్రమణ, ఈవోఆర్‌డీ శ్రీనివాసులు, ట్రైనర్ రాజు, సర్పంచ్ గంగులమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి కులగణన సర్వే

రామసముద్రం: గ్రామాల్లో ఈనెల 19నుంచి 28 వరకు కులగణన సర్వే నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎల్. నారాయణస్వామి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి సందర్శించి కులాల వారీగా పక్కగా కులగణన సర్వే నిర్వహించాలన్నారు.

అభివృద్ధి ప్రణాళికపై అవగాహన

తంబళ్లపల్లె : గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు అవగాహన ముఖ్యమని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో 2024-25 ఆర్థిక సంవత్సరం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించడంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఏఓ ఆనందకుమార్, కార్యదర్శి రాజశేఖర్ నాయక్ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై సూచనలు ఇచ్చారు. సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు



వాల్మీకిపురం: మాట్లాడుతున్న ట్రైనర్ రాజు

అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

పెద్దమండ్యం : గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ప్రజాప్రతినిధులకు, సచివాలయ సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల ప్రణాళిక తయారీపై ఎంపీడీఓ వివరించారు. ఏవో వి.ఆర్ వెంకటేశ్వరరావు, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జి రమేష్, ఈవోపీఆర్‌డి జనార్ధన్, సర్పంచ్‌లు మొలకబయ్యారెడ్డి, బాషా, విశ్వనాథ, పీరాన్‌బి, విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీలు మంచూరి జయరాం, కో ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

పెద్దతిప్పసముద్రం : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి అధ్యక్షతన ఈవోఆర్డీ యోగానంద్ గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ఆయా గ్రామాల్లో చేయాల్సిన అభివృద్ధి పనుల యాక్షన్ ప్లాన్‌లపై అవగాహన కల్పించారు.